క్లుప్తంగా

ఈరన్న స్వామికి పూజలు



పూజలందుకుంటున్న ఈరన్నస్వామి

కౌతాళం: మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్నస్వామి దర్శనానికి సోమవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారు జామున సుప్రభాతసేవ, మహామంగళహారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి ఫలపుష్పాలతో అలంకరించారు. అనంతరం భక్తులను దర్శనానికి వదిలారు. ఆలయంలో కొందరు భక్తులు తమ మొక్కులు తీర్చుకునేందుకు ఆవరణలో పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించి భక్తిని చాటుకున్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి సాయం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆదోని టౌన్: మండిగిరి 20వ వార్డులో నివాసముంటున్న చెప్పులు కుట్టే బసన్న అనారోగ్యంతో సోమవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే సా యిప్రసాద్‌రెడ్డి రూ.7 వేలు మట్టి ఖర్చులకై వైఎస్సార్‌సీపీ నాయకుల ద్వారా అందజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు గంజిలయ్య, బీరువా ల హనుమంతు, టైలర్ శేఖర్, మణి,దుర్గేష్, ఉమేష్, మహేంద్ర తదితరులు నివాళులర్పించారు.

పర్యావరణాన్ని రక్షిద్దాం

కౌతాళం: పర్యావరణాన్ని రక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సర్పంచ్ పాల్ దినకర్ అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం మండల కేంద్రమైన కౌతాళంలో కళాజాతాతో పర్యావరణంపై అవగాహన కల్పించారు. కళాజాత బృందం రామాంజినేయులు, శ్రీనివాసులు పాటల ద్వారా తడి చెత్త, పొడి చెత్త వేరు వేరుగా వేసుకోవాలని, పరసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అలాగే రౌడూరు గ్రామంలోనూ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యత పాటించాలి



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఆదోని అర్బన్: గుత్తేదారులు నాణ్యతను పాటించాలని ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు. సోమవారం ఆదోని రైల్వేస్టేషన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైల్వే ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం రైల్వే ట్రాక్‌కు ఇరువైపులా ప్రహరీ ఏర్పాటు చేస్తోందన్నారు. ప్రమాదాలను అరికట్టేందుకు ఆదోనిలో కూడా 8 కి.మీ. వరకు రూ.80 లక్షలతో ఇలాంటి పనులు అధికారులతో కలిసి చేస్తున్నామని తెలిపారు.

గోనెగండ్ల తహసీల్దార్‌గా రాజేశ్వరి



గోనెగండ్ల: మండల తహసీల్దార్‌గా పి. రాజేశ్వరి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేస్తున్న కుమారస్వామి బదిలీపై స్పెషల్ తహసీల్దార్, కేఆర్‌ఆర్‌సీ, ఆర్‌డీఓ, కర్నూలుకు వెళ్లారు. సూపరింటెండెంట్ మెజిస్టీరియల్ సెక్షన్, కలెక్టర్ ఆఫీస్‌లో పనిచేస్తూ సాధారణ ఎన్నికల బదిలీల్లో భాగంగా బదిలీపై గోనెగండ్లకు వచ్చినట్లు నూతన తహసీల్దార్ రాజేశ్వరి తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం రెవెన్యూ సిబ్బంది ఆమెను పూలమాలలు, బోకేలతో సత్కరించారు.

మందుబాబులకు జరిమానా

నందవరం : బహిరంగ ప్రదేశాలల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ కేశవ హెచ్చరించారు. నందవరం మండల కేంద్రం పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 6 మంది, బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించడంతో ఏడుగురు వ్యక్తులపై కేసులు నమోదు చేశారు. సోమవారం కేసు నమోదు చేసిన వారిని ఎమ్మిగనూరు కోర్టులో హాజరు పరుచుగా జడ్జి విచారణ చేపట్టి డ్రంక్ అండ్ డ్రైవ్ వారిపై ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున రూ.60,000, బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించిన వారిపై ఒక్కొక్కరికి రూ.1,000 చొప్పున రూ.7 వేలు జరిమానా విధించినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

రైలు ఢీకొని మహిళకు గాయాలు

ఆదోని సెంట్రల్: పట్టణంలోని క్రాంతినగర్‌కు చెందిన శ్రావణి అనే వివాహిత ఆదోనిలోని ఎల్‌సీ గేటు 195 వద్ద ట్రాకు దాటుతుండగా రైలు ఢీకొందని రైల్వే ఎస్‌ఐ గోపాల్ తెలిపారు. రైలు నంబర్ 17301 బసవ ఎక్స్‌ప్రెస్ ఢీకొనడంతో శ్రావణి తీవ్రంగా గాయపడిందని, వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు.

జగన్ అంటే నమ్మకం

- మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్
- జగన్ అంటే నమ్మకం... చంద్రబాబు అంటే మోసం పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్

ఆదోని టౌన్: జగన్ అంటేనే ఓ నమ్మకమని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ అన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జగన్ అంటే నమ్మకం... చంద్రబాబు అంటే మోసం అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో రెడ్ బుక్ పాలన కొనసాగుతుందన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వెయ్యి రూపాయలు మాత్రమే పెంచి పింఛన్లను అందజేసి, ఉచిత సిలిండర్లు ఇస్తామని కొందరికి మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకుందన్నారు. ప్రతి విద్యార్థికి తల్లికి వందనం పథకం కింద రూ.15 వేలు ఇస్తామని హామీ ఇచ్చి కేవలం రూ.13 వేలు మాత్రమే అందజేసి ప్రజలను నిలువునా మోసం చేసిందన్నారు. అలాగే ఎస్సీలకు, బీసీలకు 50 సంవత్సరాలు దాటిన వారికి పింఛన్లు ఇస్తామని ఎన్నికల సందర్భంగా ప్రజలను మభ్య పెట్టి ఇంత వరకు పెన్షన్ల ఊసే లేదన్నారు. అన్నదాత సుఖీభవ పేరుతో రైతులకు సంవత్సరానికి రూ.20 వేలు ఇస్తామని ఇంతవరకు చిల్లిగవ్వ కూడా ఇవ్వలేదన్నారు. సాధ్యంకాని హామీలు ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు ఇచ్చి అధికారంలోకి రావడం పరిపాటిగా మారిందన్నారు. ప్రజల్లో చైతన్యం రావాలని, ప్రభుత్వాన్ని నిలదీయాలని పిలుపునిచ్చారు.

అధికారంలోకి వచ్చేందుకు 143 హామీలు

సీఎం చంద్రబాబు అధికారంలోకి రావడానికి ప్రజలను మభ్య పెట్టేందుకు 143 హామీలు ఇవ్వడం జరిగిందని ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ అన్నారు. అయితే ఆ హామీలు సంవత్సరం పూర్తి అయినా అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ఉచిత బస్సు సౌకర్యం ఇంతవరకు అమలు చేయలేదన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో సకాలంలో రైతులకు ఎరువులు, విత్తనాలు, రైతు భరోసా అందించిందని, రైతుల పక్షపాతిగా మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారన్నారు. విద్యకు, వైద్యానికి జగన్ ప్రాధాన్యత ఇచ్చారని గుర్తు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు దేవా, మున్సిపల్ చైర్‌పర్సన్ లోకేశ్వరి, మున్సిపాలిటీ జిల్లా విభాగం అధ్యక్షుడు నాగరాజు, మురళీరెడ్డి, పరిగెల నారాయణ, దానం తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ చర్చకు సిద్ధం

- గతాన్ని మరిచి ఆరోపణలు
- ఏడాది పాలనలో టీడీపీ ఇన్‌చార్జ్ చేసింది శూన్యం
- వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై. ప్రదీప్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై.ప్రదీప్‌కుమార్‌రెడ్డి

మంత్రాలయం : టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాఘవేంద్రరెడ్డి అభివృద్ధిపై విసిరిన బహిరంగ చర్చ సవాలుకు తాము సిద్ధంగా ఉన్నామని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై.ప్రదీప్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని రాంపురం గ్రామంలో పార్టీ నాయకులతో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. రాఘవేంద్రరెడ్డి తన గతాన్ని మరిచి మాట్లాడటం సిగ్గు చేటన్నారు. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి కుటుంబానికి టీడీపీ భిక్ష పెట్టిందనడం సరికాదన్నారు. ఆనాడు టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీ రామారావు కోరిక మేరకు మా తాత వై.భీమారెడ్డి ఉరవకొండ నుంచి పోటీ చేసి గెలవడం జరిగిందన్నారు. 2009లో దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి ప్రజారంజక పాలన చూసి నియోజకవర్గ ప్రజల ఆకాంక్ష మేరకు ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి కాంగ్రెస్‌లో చేరారని గుర్తు చేశారు. తమ కుటుంబం నాటి నుంచి వైఎస్సార్ కుటుంబంతో ప్రయాణం చేస్తోందన్నారు. అయితే ఐదేళ్లకోసారి పార్టీ మారడం రాఘవేంద్రరెడ్డి కుటుంబానికే చెల్లిందన్నారు. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి చొరవతోనే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మీ నాన్న రామిరెడ్డికి కేడీసీసీ బ్యాంకు చైర్మన్ పదవి వచ్చిందని గుర్తు చేశారు. మండలానికి పరిమితమైన మీ కుటుంబానికి జిల్లా స్థాయి గుర్తింపు తేవడానికి వై.బాలనాగిరెడ్డి కృషి ఎంతో ఉందని చెప్పారు. ఇవన్నీ మరిచిపోయి తాము టీడీపీ వెన్నుపోటు పొడిచామని తప్పుడు ప్రచారం చేయడం తగదన్నారు.

ఏడాదిలో సాధించిందేమీలేదు

నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి చేసింది శూన్యమని మాట్లాడటం హాస్యాస్పదమని ప్రదీప్ రెడ్డి అన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఏమీ చేయకుండా అభివృద్ధిపై బహిరంగ చర్చకు సవాలు విసరడం విడ్డూరంగా ఉందన్నారు. సాధారణ నిధులతో జరిగిన పనులు తప్ప నియోజకవర్గానికి రాఘవేంద్రరెడ్డి సొంతంగా సాధించి తెచ్చిన ప్రాజెక్టు లేదన్నారు. మీకు దమ్ముంటే ప్రగతిపై బహిరంగ చర్చకు సిద్ధ పడాలని, నీవు చెప్పిన సమయానికి, ప్రదేశానికి వస్తామని ప్రతి సవాలు విసిరారు. అంతే గాక తమ పార్టీ నాయకుడు మురళీమోహన్‌రెడ్డి వందల ఎకరాల భూమికి కబ్జా చేశారని ఆరోపించడం సబబుకాదని, ఉంటే నిరూపించాలని డిమాండ్ చేశారు. రెండు ఎకరాల ప్రస్తావన తెరపైకి తెచ్చారని పొరపాటు జరిగి ఉంటే సదరు భూమిని యజమానికి స్వాధీన పరుస్తామని చెప్పారు. సమావేశంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పురుషోత్తంరెడ్డి, జిల్లా కార్యదర్శులు ఏకాంబరరెడ్డి, మాబుసాబ్, యువజన విభాగం రాష్ట్ర సహాయ కార్యదర్శి రఘురామ్, ఆయా మండలాల కన్వీనర్లు జి.భీమారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, ప్రహ్లాదాచార్, బెట్టనగౌడ్, బూత్ కమిటీ నియోజకవర్గ కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి, కౌతాళం ఎంపీపీ అమరేష్, వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు నాడిగేని నాగరాజు, అర్లబండ సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు మహంతేష్‌స్వామి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు రాజశేఖర్‌రెడ్డి, నాయకులు గజేంద్రరెడ్డి, శివరామ్ రెడ్డి, దొడ్డి నరసన్న పాల్గొన్నారు.

ఏరువాక పౌర్ణమి సంబరాలు



పరుగు పందెం విజేత జయరామ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

పెద్దకడబూరు : మండలంలోని నౌలేకల్లు గ్రామంలో సోమవారం ఏరువాక పౌర్ణమి వేడుకలను ప్రజలు వేడుకగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పరుగు పందెంలో మొదటి స్థానంలో వచ్చిన జయరాజ్‌ను ఏఎస్‌ఐ శివరాముడు, గ్రామ ప్రజలు శాలువా, పూలమాలలతో సన్మానించి గ్రామంలో ఊరేగించారు. ఏఎస్‌ఐ మాట్లాడుతూ గ్రామ ప్రజలు ప్రతి పండుగను ఇలాగే కలసిమెలసి జరుపుకోవాలని సూచించారు.

అక్రమాలను అరికట్టాలి

ఆదోని టౌన్: పట్టణంలోని రాంజల చెరువులో ఇతరులు అక్రమంగా వలలు వేసి చేపలు పడుతున్నారని, అక్రమాలను అరికట్టాలని గంగపుత్రులు మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణను కలిసి విన్నవించుకున్నారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. తాము చెరువులో వలలు వేసి చేపలు పట్టేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు. స్పందించిన మున్సిపల్ కమిషనర్ అక్రమంగా చెరువులో వలలు వేసి చేపలు పట్టే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

కౌతాళం ఎంపీడీఓగా రాజేంద్రప్రసాద్

కౌతాళం: మండల ఎంపీడీఓగా సోమవారం రాజేంద్రప్రసాద్ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న విజయశేఖర్ ఆదోని మండలానికి బదిలీ కావడంతో అక్కడ పనిచేస్తున్న రాజేంద్రప్రసాద్‌ను కౌతాళంకు బదిలీ చేశారు. దీంతో రాజేంద్రప్రసాద్ సోమవారం బాధ్యతలు చేపట్టారు.


హక్కులను కాలరాస్తే ఉద్యమిస్తాం

ఎమ్మిగనూరుటౌన్: కార్మికుల హక్కులను కాలరాస్తే ఉద్యమం తప్పదని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ డివిజన్ నాయకుడు రాజు, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ హెచ్చరించారు. సోమవారం పట్టణంలో ఆయా సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టి స్థానిక లేబర్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సంబంధిత శాఖ అధికారికి అందజేశారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు ఏసేపు, ఎజ్కేలు, అగస్టీన్, రాముడు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలి

ఆదోని రూరల్: భవన నిర్మాణ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి జి.వెంకప్ప, కుమార్, నారాయణ డిమాండ్ చేశారు. సోమవారం వారు ఆదోనిలోని లేబర్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం భవన నిర్మాణ కార్మికుల కోసం బీఓసీ బోర్డు నుంచి ఆయా ప్రభుత్వాలు వాడుకున్న నిధులను వెంటనే బోర్డుకు జమ చేయాలన్నారు.

గోపాల్‌రెడ్డికి పరామర్శ



గోపాల్‌రెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ మధుసూదన్

ఆదోని టౌన్: కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్.గోపాల్ రెడ్డిని సోమవారం రాత్రి ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ ఇంటికెళ్లి పరామర్శించారు. ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. గోపాల్ రెడ్డి త్వరగా కోలుకుని పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని భగవంతుడిని ప్రార్థించారు.

క్షయ వ్యాధి నిర్మూలనకు కృషి చేద్దాం



క్షయ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్, వైద్య సిబ్బంది

ఆదోని టౌన్: క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ లోకేశ్వరి, మెడికల్ ఆఫీసర్ అనిల్‌కుమార్, సూపర్‌వైజర్లు బాబురాజు, జ్ఞానేశ్వరి పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని 40వ వార్డు శుక్రవారపేట ప్రాంతంలో క్షయవ్యాధి నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం ఉన్నవారు, గళ్లలో తెమడ మరియు రక్తం పడడం, ఛాతిలో నొప్పి, ఆయాసం, శ్వాస ఆడకపోవడం, బరువు తగ్గడం, ఆకలి మందగించడం, శరీరంలో ఇతర భాగాల్లో వాపు, కణితలు ఉన్న వారు పై లక్షణాల్లో ఏ ఒక్క లక్షణం ఉన్నా ప్రభుత్వ ఆసుపత్రిలో గళ్ల పరీక్ష చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు సుగుణమ్మ, ఆశా వర్కర్లు లక్ష్మి, అంజలి, ఖాజాబాను, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

టీబీ పరీక్షలు చేయించుకోవాలి

పెద్దకడబూరు : రెండు వారాలకు మించి దగ్గు, జ్వరము, తేమడలో రక్తం పడటం, ఛాతిలో నొప్పి తదితర లక్షణాలు ఉన్నవారు తప్పక టీబీ పరీక్షలు చేయించుకోవాలని జిల్లా లెప్రసి ఎయిడ్స్, టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ భాస్కర్ సూచించారు. టీబీ ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని జాలవాడి గ్రామంలో సోమవారం పర్యటించారు. క్షయవ్యాధి అనుమానిత లక్షణాలు ఉన్న 63 మందికి ఎక్స్ రే పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ సుస్మిత, టీబీ సూపర్‌వైజర్లు చాంద్ బాషా, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

యోగా దినోత్సవాన్ని పకడ్బందీగా నిర్వహించండి

పెద్దకడబూరు : ఈ నెల 21న యోగా దినోత్సవాన్ని పకడ్బందీగా నిర్వహించాలని మండల ప్రత్యేకాధికారి నాగరాజురావు సూచించారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మండల అధికారులు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శిలతో సోమవారం మధ్యాహ్నం యోగాంధ్ర ఫేజ్ 1, 2, 3 హాజరుపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. యోగాంధ్ర దినోత్సవాన్ని మండల అధికారులు ప్రత్యేకంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రభావతి, మండల విద్యాధికారి రామమూర్తి, ఈఓపీఆర్డీ జయరాముడు తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదివితే మంచి భవిష్యత్



కేజీబీవీ పాఠశాలకు కంప్యూటర్, ప్రింటర్ అందిస్తున్న బుట్టా ప్రతుల్ దంపతులు

ఎమ్మిగనూరుటౌన్: క్రమశిక్షణతో కూడిన చదువులు చదివితేనే విద్యార్థులకు మంచి భవిష్యత్ వుంటుందని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుట్టా ప్రతుల్ అన్నారు. పట్టణంలోని మైనారిటీ కాలనీలో ఉన్న కేజీబీవీ పాఠశాలలో కంప్యూటర్ అవసరం వుందని విద్యార్థుల విన్నపం మేరకు ఆయన బుట్టా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం తన సతీమణి బుట్టా సాహితితో కలిసి పాఠశాలకు వెళ్లి కంప్యూటర్, ప్రింటర్‌ను విరాళంగా అందజేశారు. విద్యార్థినులు మంచిగా చదువుకొని రాణించాలని సూచించారు. కార్యక్రమంలో బుట్టా ఫౌండేషన్ మేనేజర్ చరిత, వైఎస్సార్‌సీపీ నాయకులు సయ్యద్‌చాంద్, కరీమ్ పాల్గొన్నారు.

హామీలు అమలు చేయకుండా వెన్నుపోటు



వెన్నుపోటు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక, పార్టీ నాయకులు

- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక
- పార్టీ శ్రేణులతో కలిసి వెన్నుపోటు పుస్తక ఆవిష్కరణ

ఎమ్మిగనూరుటౌన్: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ఏడాదైనా అమలు చేయక ప్రజలకు వెన్నుపోటు పొడిచిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కిందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక అన్నారు. సోమవారం పట్టణంలోని శిల్పాఎస్టేట్‌లోని పార్టీ కార్యాలయ ఆవరణలో కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయని వైనంపై ప్రచురించిన వెన్నుపోటు పుస్తకాన్ని పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసి సంపదను సృష్టించి సంక్షేమ పథకాలను ఇస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం.. ఏడాదైనా వాటి ఊసేలేదన్నారు. సంవత్సర కాలంలో అరాచకాలు, అత్యాచారాలు, హత్యలు, ఘోరాలు, నేరాలతో రక్తపాతంతో కక్షపూరిత పాలన కొనసాగిస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులు చేసినా టీడీపీ వారిపై కేసుల నమోదే లేదన్నారు. అదే వైఎస్సార్‌సీపీ వారిపై ఎప్పటి కేసులనో తిరగదోడి జైళ్లకు పంపిస్తూ రెడ్‌బుక్ పాలన పేరుతో భయభ్రాంతులకు గురిచేస్తున్నారని విమర్శించారు.

రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమంపై దృష్టి సారించాలి

రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమంపై దృష్టి సారించాల్సింది పోయి ఇలా కక్షపూరితంగా పాలించడం సమంజసం కాదని బుట్టా రేణుక అన్నారు. సూపర్ సిక్స్ అంటూ కేవలం పింఛన్ మాత్రమే పెంచారని, ఇప్పుడు తల్లికి వందనం పథకం పూర్తి స్థాయిలో అమలు చేయలేదన్నారు. ఇంకా రైతు భరోసా, నేతన్న నేస్తం, నిరుద్యోగ భృతి, ఉచిత బస్సు పథకాలెక్కడ అని ప్రశ్నించారు. ఉచిత బస్సు పథకం కూడా కేవలం జిల్లా వరకే పరిమితం అని చెబుతున్నారని ఇలా ఎన్నో మోసాలు చేస్తూ వెన్నుపోటు పొడుస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ప్రజలను మభ్యపెట్టేందుకు సీఎం చంద్రబాబునాయుడు సూపర్ సిక్స్ అమలు చేశామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గత ప్రభుత్వ హయాంలో మొదలెట్టిన నాడు–నేడు పథకం, ఆరోగ్యశ్రీ పథకాలను సక్రమంగా అమలు చేయా లని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యువతకు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి అందించాలన్నారు.

ఏడాదిలో రూ.1.54లక్షల కోట్ల అప్పు

ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం రూ.1.54లక్షల కోట్ల అప్పులు చేసిందని, అయినా ఇచ్చిన హామీలు, సంక్షేమ పథకాలు అమలు చేయలేదని పార్టీ ఇన్‌చార్జ్ విమర్శించారు. అదే మాజీ సీఎం వైఎస్ జగనన్న కోవిడ్ ఉన్నా సంక్షేమ పథకాలు అమలు చేశారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆదాయం లేకపోయినా సంక్షేమ పథకాలు అందించిందని చెప్పారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుట్టా ప్రతుల్, బుట్టా సాహితి, సీనియర్ నాయకులు బుట్టా శివనీలకంఠ, మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు బీఆర్ బసిరెడ్డి, కామర్తి నాగేషప్ప, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్, రాష్ట్ర బీసీ సెల్ సంయుక్త కార్యదర్శి విరుపాక్షిరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి సునీల్‌కుమార్, పార్టీ నాయకులు కోటకొండ నరసింహులు, రాజు, పాలశ్రీనివాస రెడ్డి, కౌన్సిలర్లు బజారి, అంపమ్మ, ఖాశింబేగ్, రాజారత్నం, మాబ్బాషా, సుధాకర్, విశ్వనాథ్, రమేష్, పాల శ్రీనివాస రెడ్డి, సయ్యద్‌చాంద్, రఘు, వార్డు ఇన్‌చార్జ్‌లు, సర్పంచ్‌లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రితో సీడీఆర్ కమిషన్ అధ్యక్షుడు



కేంద్ర మంత్రికి జ్ఞాపిక అందజేస్తున్న సీడీఆర్ కమిషన్ అధ్యక్షుడు కిషోర్‌కుమార్

మంత్రాలయం : రాఘవేంద్రస్వామి దర్శనార్థం మంత్రాలయం విచ్చేసిన కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, పౌర సరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద జోషిని కర్నూలు జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ అధ్యక్షుడు కె.కిషోర్ కుమార్, సభ్యుడు నారాయణరెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. సోమవారం సాయంత్రం స్థానిక నరహరి తీర్థ అతిథి నిలయంలో ఆయనను కలిసి శ్రీశైలం మల్లన్న, జోగులాంబ అమ్మవార్ల జ్ఞాపికలను అందజేశారు.

రైతులకు అందుబాటులో ఉంటా

పెద్దకడబూరు : రైతులకు అందుబాటులో ఉండి అన్ని విధాలుగా సహాయసహకారాలు అందిస్తానని నూతనంగా బాధ్యతలు చేపట్టిన మండల వ్యవసాయాధికారి సుచరిత అన్నారు. సాధారణ బదీలలో భాగంగా మండలంలో పని చేస్తున్న వ్యవసాయాధికారి ఎం వరప్రసాద్ కోసిగికి వెళ్లగా అనంతపురం జిల్లా ఆత్మకూరు మండలంలో పని చేస్తున్న సుచరిత పెద్దకడబూరు మండలానికి వచ్చారు. ఈ మేరకు సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

కోసిగి ఏఓగా వరప్రసాద్

కౌతాళం (కోసిగి) :కోసిగి మండల వ్యవసాయాధికారిగా వరప్రసాద్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన పెద్దకడబూరు నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు.

నందవరం ఏఓగా సరిత

నందవరం : నందవరం మండల వ్యవసాయ అధికారిణిగా సరిత సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న మర్రి స్రవంతి కడపకు బదిలీ కాగా అనంతపురం కల్యాణదుర్గం నియోజకవర్గం బ్రహ్మసముద్రం మండలం నుంచి సరిత ఇక్కడికి వచ్చారు.

అక్రమ ఫీజులు అరికట్టాలి

ఆదోని సెంట్రల్: అక్రమంగా ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ వీరేష్ డిమాండ్ చేశారు. సబ్‌కలెక్టర్ కార్యాలయ అధికారిణి వసుంధరకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో సమస్యలు పరిష్కరించండి

కౌతాళం: (కోసిగి) కోసిగిలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో హాస్పిటల్ వద్ద ధర్నా నిర్వహించారు. వినతి పత్రాన్ని డాక్టర్ మనోజ్‌కుమార్‌కు అందజేశారు. భాస్కర్ యాదవ్ వీరేష్, శ్రీనివాసులు, వీరారెడ్డి, ఈరన్న పాల్గొన్నారు.

నౌలేకల్లు హైస్కూల్‌లో చేరండి



పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

పెద్దకడబూరు : మండల పరిధిలోని నౌలేకల్లు గ్రామంలోని ఉన్నత పాఠశాలలో చుట్టుపక్క గ్రామాల విద్యార్థులు చేరాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గౌరీనందన్‌రెడ్డి కోరారు. నౌలుకల్లు గ్రామంలో ఉన్న ప్రాథమికోన్నత పాఠశాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ అయ్యిందని చెప్పారు. ఈ సందర్భంగా గ్రామంలోని పూర్వ విద్యార్థులు కొత్తగా పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులను సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం, పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ గ్రామానికి చుట్టుపక్క గ్రామాలైన మేకడోణ, ముచ్చిగిరి గ్రామాల విద్యార్థులు 8వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుకోవడం కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా నౌలేకల్లు ఉన్నత పాఠశాలలో చేరాలని కోరారు.

తల్లికి వందనం వర్తింపజేయాలి

మంత్రాలయం : తల్లికి వందనం పథకం తమ పిల్లలకు వర్తింపజేయాలంటూ అంగన్‌వాడీ కార్యకర్త లు, ఆయాలు ఆందోళన బాట పట్టారు. సోమ వా రం కమ్యూనిస్టు సంఘాల మద్దతుతో రెవెన్యూ కార్యాలయాల ఎదుట ధర్నాలకు దిగారు. మంత్రా లయం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం, సీఐటీయూ ఆధ్వ ర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి జయరాజు, సీఐటీయూ మండల కార్యదర్శి టి.భీమేశ్వరి, అధ్యక్షురాలు విశాలాక్షి మాట్లాడుతూ అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడంతో తమ పిల్లలకు తల్లికి వందనం వర్తించడం లేదన్నారు. చాలీచాలని జీతాలతో కుటుంబాలను నెట్టుకొస్తున్నామని వాపోయారు. తమ పిల్లలను చదువులు కొనసాగించేందుకు తమకు తల్లికి వందనం పథకం వర్తింపజేయాలని కోరారు.

ఎమ్మిగనూరుటౌన్: అంగన్ వాడీ సిబ్బందికి సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యునియన్ జిల్లా సహాయ కార్యదర్శి గోవర్ధనమ్మ, అర్బన్ కార్యదర్శి నాగలక్ష్మి, సీఐటీయూ మండల కార్యదర్శి రాముడులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి రెవెన్యూ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్ శేషఫణికి వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో యునియన్ నాయకులు నీరజ, తులసి, లక్ష్మిదేవి, మల్లేశ్వరి, గ్రేసమ్మ, అక్తర్‌బాను తదితరులు పాల్గొన్నారు.

కౌతాళం(కోసిగి): అంగన్‌వాడీ వర్కర్స్‌లకు కూడ తల్లికి వందనం అమలు చేయాలని కోరుతూ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కోసిగి తహసీల్దారు రుద్రగౌడ్‌కు అందజేశారు. సీఐటీయూ కోసిగి మండల కార్యదర్శి రాముడు వరలక్ష్మి, సుజాత, పద్మ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు పథకాలను అందించాలి

ఆదోని రూరల్: అంగన్‌వాడీ వర్కర్లకు కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాని అంగన్‌వాడీ వర్కర్లు, సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. తహసీల్దార్ రమేష్‌కు వినతి పత్రం అందజేశారు. సీఐటీయూ నాయకులు తిప్పన్న, గోపాల్, రామాంజనేయులు పాల్గొన్నారు.

కౌతాళం: అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. వినతి పత్రాన్ని తహసీల్దారు రజనీకాంత్‌రెడ్డికి అందజేశారు. యూ నియన్ నాయకురాలు విజయలక్ష్మి, రోజ్‌మేరి, దీప్తి, రాధా, మీనాక్షి పలువురు పాల్గొన్నారు.